క్లుప్తంగా

ఎక్కడ చూసినా ఉగాది సందడే



గణపవరంలో వేపపువ్వు సేకరిస్తున్న యువకులు

గణపవరం: ఎక్కడ చూసినా ఉగాది సందడే. ఏపల్లె చూసినా ఉగాది ఆనందం. తెలుగు లోగిళ్లన్నీ కళకళలాడుతున్నాయి. తెలుగు వారికి అత్యంత ప్రీతిపాత్రమైన ఉగాది పర్వదిన సందడి ఒకరోజు ముందుగానే కనిపించింది. ఆదివారం విశ్వావసు ఉగాది సందర్భంగా శనివారం నుంచే ఉగాది సందడి ప్రారంభమైంది. ఉగాదికి ప్రత్యేకమైన ఉగాది పచ్చడికోసం గ్రామాల్లో ప్రజలు వేపపువ్వు సేకరణలో బిజీగా ఉన్నారు. వేపచెట్లు ఎక్కి మరీ వేపపువ్వును సేకరిస్తున్నారు. ఉగాది పచ్చడికి కావలసిన చెరకు, మామిడి కాయలు, పూల వ్యాపారం కూడా జోరుగానే సాగింది.

నేటి నుంచి అంకమ్మ తల్లి జాతర

దెందులూరు: మండలంలోని కొవ్వలి గ్రామ దేవత గోవాడ అంకమ్మ తల్లి జాతర మహోత్సవం ఈ నెల 30వ తేదీ నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోవాడ నాగరాజు తెలిపారు. శనివారం ఆలయంలో ఆయన మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా వందలాది మంది భక్తుల ఆధ్వర్యంలో గోవాడ అంకమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ఉగాది జాతర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి మహోత్సవాలు సందర్భంగా రెండోరోజు అంకమ్మ తల్లి ఆలయ ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాలను అంకమ్మ తల్లి జాతర ఉత్సవ కమిటీ సెక్రటరీ గోవాడ శ్రీను, వైస్ ప్రెసిడెంట్ శీలం అప్పారావు, క్యాషియర్ గుల్లపూడి రమేష్, సభ్యులు గోవాటి దుర్గారావు, గోవాడ సాంబ, కొల్లూరు సాయి తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

నేటి నుంచి చల్లాలమ్మ ఉత్సవాలు ప్రారంభం

ఉంగుటూరు: ఉంగుటూరు ప్రజల ఇలవేల్పు, గ్రామ దేవత చల్లాలమ్మ అమ్మవారి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవదాయ ధర్మా దాయశాఖ ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే ఆలయాన్ని వివిధ రకాల పూలతో అలంకరించారు. ఉత్సవాల్లో భారీ ప్రత్యేక సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

చాటపర్రులో రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమం



రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

దెందులూరు: మండలంలోని చాటపర్రు ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని చాటపర్రు పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈఓ రామాంజనేయులు, ఎంపీహెచ్ ఎస్. కిరణ్ అన్నారు. శనివారం ఉన్నత పాఠశాలలో 152 మంది విద్యార్థులకు శరీరంలో అన్ని భాగాలకు సంబంధించి సమాచారాన్ని ఆధార్ కార్డు వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రతి విద్యార్థికి ఐడీ ఇవ్వటం జరుగుతుందని ఆ ఐడీలో ఆ విద్యార్థి ఆరోగ్యానికి సంబంధించి పూర్తి వివరాలు ఉంటాయన్నారు. ఏఎన్ఎం సంధ్య, సీహెచ్‌ఓలు పావని, జాహ్నవి, ఆశ కార్యకర్తలు కృష్ణకుమారి, వెంకటలక్ష్మి, జ్యోతి ఉన్నారు.

మామిడి తోటకు వేలంపాట

కుక్కునూరు: మండలంలోని పెద్దరావిగూడెం పంచాయతీ వెంకటాపురం గ్రామంలో ఉన్న మామిడితోటలో ఫల సాయం పొందేందుకు ఏప్రిల్ 2న పంచాయతీ కార్యాలయంలో వేలంపాట నిర్వహించనున్నట్టు తహసీల్దార్ కె.రమేష్ బాబు శనివారం తెలిపారు. కేఆర్ పురం ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు నిర్వహించే వేల ం పాట పూర్తి వివరాలకు ఈ సెల్ నెంబర్ 89770 18664లో సంప్రదించాలని పేర్కొన్నారు.

మహిళలకు దుస్తుల పంపిణీ

కామవరపుకోట: స్థానిక కొత్తూరు జామియా మసీదు వద్ద శనివారం 15 మంది ముస్లిం మహిళలకు షేర్, కేర్ సంస్థ ఆధ్వర్యంలో చీరలు, నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మసీద్ సంఘ సభ్యుడు షేక్ ఇబ్రహీం మాట్లాడుతూ రంజాన్ మాసంలో నిరుపేదలకు దానం చేయటం ద్వారా అల్లా కరుణాకటాక్షాలు ఉంటాయని, అల్లాపై నమ్మకం పాటిస్తూ ముస్లిం మహిళలకు సహాయం అందించిన షేర్, కేర్ సంస్థ వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు తమ్మిశెట్టి మోహన్, తమ్మిశెట్టి రమేష్‌బాబు, మస్జిద్ సంఘ సభ్యులు లాల్ జాన్ బాషా, నూర్ ఆలీ ఖాన్, బాబు జాన్, జవ్వాది మూర్తి, యోధ, జిలాని, వజీర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో ఇటుక పరిశ్రమ

- నిలిచిపోయిన కొనుగోళ్లు
- పెరిగిన మెటీరియల్ ధరలు
- దిక్కుతోచని స్థితిలో వ్యాపారులు



ముందూరులో ఇటుక బట్టీ దృశ్యం

పెదవేగి : ఇటుకబట్టీ పరిశ్రమ సంక్షోభంలో చిక్కుకుంది. పాలనా పరమైన ప్రణాళిక లేకుండా ఇసుక రీచ్‌లపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు నిర్మాణ రంగాన్ని కుదేలు చేసింది. ఫలితంగా ఇటుకల కొనుగోలు చేసే వారు లేకపోవడంతో ఇటుకల వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. దెందులూరు నియోజకవర్గంలోని ముండూరు, భోగాపురం, దెందులూరు, బాపిరాజుగూడెం, కొత్తూరు గ్రామాల్లో ఇటుక పరిశ్రమలు ఉన్నాయి.

పెరిగిన మెటీరియల్ ధరలు

మట్టి ధరలు కూలీ, బొగ్గు, వరిపొట్టు ధరలు పెరగడం ఇటుక పరిశ్రమను మరింత దెబ్బతీస్తున్నాయి. ప్రస్తుతం వెయ్యి ఇటుకల ధర రూ. 5,500, ఉంది. గతంలో మట్టి ట్రాక్టర్ విలువ రూ. 500 ఉండగా నేడు రూ.700కు చేరింది.

నిలిచిన ఇళ్ల నిర్మాణాలు

ఆర్థిక సంక్షోభం కారణంగా ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోవడంతో ఇటుకలు కొనే వారు కరువయ్యారు. మరో పక్క గృహ నిర్మాణ పథకం కింద నియోజకవర్గ వ్యాప్తంగా కొన్ని ఇళ్లు మంజూరు చేసినట్లు అనధికారికంగా చెబుతున్నారు. ప్రభుత్వం మీద నమ్మకం లేక, అప్పో సప్పో చేసి ఒక గూడు నిర్మించుకుందామని అనుకుంటే ఇప్పుడు మెటీరియల్ ధర పెరిగిపోవడం సామాన్యుల పాలిట పెనుశాపంగా మారింది. దీనికి తోడు ఇసుక రీచ్‌లను మొదట డ్వాక్రా గ్రూపులకు అప్పగించడం. తర్వాత ఉచితంగా ఇసుక అనడం వంటివి వాటితో సామాన్యులకు ఇసుక లభించడం గగనమైంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇటుక వ్యాపారులకు రాయితీలు కల్పించాలని యజమానులు కోరుతున్నారు.

అప్పులే మిగిలాయి

మా పెద్దల తరం నుంచి ఇటుకల వ్యాపారం చేస్తున్నాం. గతంలో ఇటువంటి నష్టాలు ఎప్పుడూ చూడలేదు. ప్రతి సంవత్సరం 10 లక్షల ఇటుకలు అమ్మే వాళ్లం. కానీ ఈ ఏడాది 2 లక్షల ఇటుకలు కూడా అమ్ముడు కాలేదు. రియల్ ఎస్టేట్, ఇళ్లు, మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తిగా ఆగిపోయాయి. ఫలితంగా ఇటుక పరిశ్రమ నష్టాల్లో చిక్కుకుంది.

– బి శ్రీను, ఇటుక వ్యాపారి ముండూరు

పోలవరం కాలువ నుంచి మట్టిని తరలిస్తే చర్యలు



ఆర్. శివాజీ, ఎస్ఐ, దెందులూరు

దెందులూరు: దెందులూరు మండల పరిసర ప్రాంతాల్లో ప్రవహిస్తున్న పోలవరం కుడి కాలువ గట్టు దాని సంబంధిత ప్రదేశాలలో ఉన్న మట్టిని ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా త్రవ్వడం గాని, తరలించడం గాని చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని దెందులూరు ఎస్సై ఆర్ శివాజీ హెచ్చరించారు. శనివారం దెందులూరు పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సహజ సంపద కాలువకు రక్షణగా ఉన్న పోలవరం కాలువ గట్టు మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తరలింపుకు సంబంధించి వాడిన వాహనాలపై సైతం రవాణా యాక్ట్‌ను అమలు చేస్తామన్నారు. మండల పరిధిలో పోలవరం కాలువ ప్రాంతమంతా పూర్తిస్థాయిలేగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామంలో ఉండే రెవెన్యూ పంచాయతీరాజ్ ఉద్యోగులతో పాటు స్వచ్ఛంద సంస్థలు ఎవరైనా మట్టి తరలిస్తే సమాచారాన్ని పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలన్నారు.

పాస్టర్ మృతిపై విచారణ జరిపించాలని ధర్నా



తహసిల్దార్ బి.రమాదేవికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



ప్రవీణ్ సంతాప సభలో పాల్గొన్న నిడమర్రు మండల పాస్టర్లు

భీమడోలు: క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరుతూ శనివారం మండల ఐక్య పాస్టర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని క్రైస్తవ పాస్టర్లు ఆందోళన చేశారు. మండల ఐక్య పాస్టర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు డీవీ రత్నం ఆధ్వర్యంలో మండలంలోని పాస్టర్లంతా నిరసన వ్యక్తం చేశారు. భీమడోలు తహసీల్దార్ కార్యాలయం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల అనుమానస్పద మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని నినాదాలు చేశారు. దాడుల వెనుక ఉన్న వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ బి.రమాదేవి, భీమడోలు ఏఎస్సై వెంకటేశ్వరరావులకు లిఖితపూర్వకంగా వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు డీవీ రత్నం, గౌరవ అధ్యక్షుడు ఇంజేటి అచ్యుతం విజయ్, కార్యదర్శి యెషయా, జాయింట్ కార్యదర్శి మోషే, పాస్టర్లు ప్రసాద్, డేవిడ్, జోసఫ్, జయరాజు, మిల్కియర్ పాల్గొన్నారు.

ప్రవీణ్ లేని లోటు తీరనిది

నిడమర్రు: రక్షణటీవీ క్రైస్తవ ప్రబోధకులు పగడాల ప్రవీణ్ లేని లోటు తీరనిది అని నిడమర్రు మండల పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. శనివారం నిడమర్రు మండల యూపీఎఫ్ పాస్టర్స్ ఆధ్వర్యంలో బువ్వనపల్లిలోని కె. ఇశ్రాయేలు చర్చిలో ప్రవీణ్‌కు సంతాపసభ నిర్వహించి, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని శాంతి ర్యాలీ జరిగింది. అసోసియేషన్ సభ్యులు కె. ఎలీషా, డి. డేవిడ్ రాజు, డి ప్రేమ్‌కుమార్ తదితరులున్నారు.

పాఠశాలల అభివృద్ధికి దాతల సేవలు మరువలేనివి



బీరువాలు, కుర్చీలు పాఠశాలకు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

దెందులూరు: పాఠశాలల అభివృద్ధికి దాతలు చేస్తున్న సేవలు మరువలేనివని పలువురు వక్తలు తెలిపారు. దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలకు రూ.30వేలు విలువ చేసే రెండు బీరువాలు, ఆరు నీల్ కమల్ కుర్చీలు వితరణ ఇచ్చిన పూర్వ విద్యార్థి యోని మోని పోకల అజయ్ కుమార్ ఔదార్యాన్ని చాటుకున్నారు. శనివారం దెందులూరు ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మల్లికార్జునరావు గ్రంథపాలకులు గొల్లపూడి వెంకటేశ్వరావులకు రెండు బీరువాలను, ఆరు నీల్ కమ్మలు కుర్చీలను కళావేదికపై విద్యార్థుల సమక్షంలో అందజేశారు. గ్రంథపాలకులు ఉపాధ్యాయులు బాలాజీ, గణేష్, శ్రీనివాసరావు, కళ్యాణి, వెంకటేష్, ప్రభుపాల్ విద్యార్థులు పూర్వపు విద్యార్థి మేనేజర్ పోకల అజయ్ కుమార్‌ను అభినందించారు.

పోక్సో చట్టంపై అవగాహన

కొయ్యలగూడెం: స్థానిక అపోలో స్కూల్‌లో శనివారం పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జ్ సిహెచ్ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ 18 సంవత్సరాల్లోపు పిల్లల సంరక్షణకు ఏర్పాటు చేసిన చట్టమే పోక్సో అని, లైంగిక వేధింపులపై టీచర్లకు లేదా తల్లితండ్రుల దృష్టికి తీసుకొస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. న్యాయవాదులు అచ్యుత శ్రీనివాసరావు, అపోలో స్కూల్ డైరెక్టర్ ఆర్.ప్రవీణ్ కుమా ర్, ఎస్సై వి.చంద్రశేఖర్, టీచర్స్, స్టూడెంట్స్ పాల్గొన్నారు.

15 నుంచి ఏఐవైఎఫ్ సభలు

చింతలపూడి : భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ ద్వారా దేశంలో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్. చింతలపూడి కారుమూడి సత్యనారాయణ రెడ్డి భవన్‌లో ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల పోస్టర్, లోగోను శనివారం ఆయన విడుదల చేశారు. మే 15 నుంచి 18 వరకు తిరుపతి పట్నంలో నిర్వహించే ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కృష్ణ చైతన్య కోరారు. ఏఐవైఎఫ్ జిల్లా కోకన్వీనర్ తోర్లపాటి రాజు మాట్లాడారు.

వృద్ధులకు దుస్తుల బహూకరణ



మహిళలకు దుస్తులు అందిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): జన్మనిచ్చిన తల్లిదండ్రుల రక్షణ, సంరక్షణ బాధ్యత బిడ్డలపై ఉందని బాలవికాస్ భారతి అధ్యక్షుడు, న్యాయవాది కట్టా సత్యనారాయణ అన్నారు. స్థానిక ఐద్వా జిల్లా కార్యాలయంలో వాసవి సుబ్బారావు సీతారాజ్యలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ సుబ్బారావు సహకారంతో ఉగాదిని పురస్కరించుకొని వృద్ధ మహిళలకు దుస్తులు శనివారం సాయంత్రం బహూకరించారు. వద్దులు – కుటుంబం – సమాజం – బాధ్యత అంశంపై సభ నిర్వహించారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే శిక్షార్హులవుతురని సుబ్బారావు అన్నారు. వృద్ధులు, పిల్లల కోసం తమ ట్రస్టు ద్వారా ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మానవత ఏలూరు నగర అధ్యక్షురాలు పోదరి కనకదుర్గ, వల్లూరిపల్లి సాయి సుధా, మానవత కార్యదర్శి అల్లూరి మోహిని, వీజీ ఎంవీఆర్ కష్టారావు, శొంఠ్యాల కస్తూరి రావు, కూచిపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం కలిగించాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి సునీల్‌కుమార్

ఏలూరు (టూటౌన్): నీరు, రవాణా, పోస్టల్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, విద్య, వైద్యం, రియల్ ఎస్టేట్, విద్యుత్ తదితర విభాగాల సేవల్లో లోపం ఉన్నా పర్మినెంట్ లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చునని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్ఏసీ) ఎం సునీల్ కుమార్ అన్నారు. దీనిపై పారా లీగల్ వాలంటీర్లు ప్రజల్లో చైతన్యం కలిగించాలని సూచించారు. ఏలూరు పరిధిలోని పారా లీగల్ వాలంటీర్లు, ప్రజా ప్రయోజన సేవల కార్యాలయ (పర్మినెంట్ లోక్ అదాలత్) సిబ్బందికి అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రజా ప్రయోజన సేవల కార్యాలయం పని విధానం, కేసులు దాఖలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజా ప్రయోజన సేవల చైర్ పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి మాట్లాడుతూ 2023 నుంచి ఇక్కడ ఈ కార్యాలయం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో పనిచేస్తుందని, ఇప్పటి వరకు ఈ కార్యాలయంలో 232 అర్జీలు దాఖలు చేయగా 20 కేసుల్లో తీర్పులు వెలువరించారని తెలిపారు. రూ.2,36,22,800ను కక్షి దారులకు పరిహారంగా ఇచ్చామని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్, ఇన్‌చార్జి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేకేవీ బులి కృష్ణ పాల్గొన్నారు.

వసంత నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న కుంకుళ్లమ్మ ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. తొలిరోజు అమ్మవారు లక్ష గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అర్చకులు ఆలయాన్ని గాజులతో అలంకరించే పనులు శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఆలయాన్ని పచ్చిపూలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. వసంత నవరాత్రి ఉత్సవాలు వచ్చేనెల 7 వరకు ఆలయంలో కొనసాగుతాయని, భక్తులంతా పాల్గొనాలని ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి కోరారు.

ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలి



కొఠారు అబ్బయ్య చౌదరి, మాజీ ఎమ్మెల్యే

దెందులూరు: తెలుగు నూతన సంవత్సరం షడ్రుచుల ఉగాది ప్రతి కుటుంబం ప్రగతి ప్రధాన పయనిస్తూ వెలుగులు నింపా లని నూతన శోభ వెల్లివిరియా లని ప్రతి ఒక్కరు సుఖసంతోషాలు అష్టైశ్వర్యాలు అభివృద్ధి సంక్షేమంతో తులతూగాలని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. శని వారం వారు విడుదల చేసిన ప్రకటనలో నియోజవర్గంలో రైతులతో పాటు ప్రజలందరికీ ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

2 నుంచి రుణ దరఖాస్తుదారులకు ముఖాముఖి

దెందులూరు: బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వచ్చే నెల 2నుంచి మండల పరిషత్ కార్యాలయం వద్ద బ్యాంకర్ల సమక్షంలో ముఖాముఖీ నిర్వహించనున్నట్లు దెందులూరు ఎంపీడీవో కె.శ్రీదేవి తెలిపారు. రుణాల కోసం దరఖాస్తులు చేసిన లబ్ధిదారులు ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

వైఎస్సార్ సీపీతో బడుగు వర్గాలకు గుర్తింపు

కొయ్యలగూడెం: బడుగు బలహీన, అణగారిన వర్గాల వారికి గుర్తింపు నిచ్చేది వైఎస్సార్ సీపీ మాత్రమే అని పోలవరం ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ తాడిగడప రామకృష్ణ పేర్కొన్నారు. అంకాలగూడెం గ్రామంలో శనివారం రాత్రి పార్టీ ఎస్సీ సెల్ పోలవరం నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన ఏలేటి చంద్రం అభినందన కార్యక్రమం ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రం మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని చెప్పారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీ, ఎమ్మెల్యేలు కోటగిరి శ్రీధర్, తెల్లం బాలరాజులకు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ కడకట్ల గడ్డియ్య, ఎంపీటీసీ జాన్ డేవిడ్ కింగ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు దూలపల్లి కాంతారావు, పాల్గొన్నారు.

జిల్లా పోలీస్‌కు డ్రోన్స్, సీసీ కెమెరాలు



ఏఎస్పీకి డ్రోన్స్, సీసీ కెమెరాలు అందిస్తున్న కంపెనీ డైరెక్టర్లు

ఏలూరు టౌన్ : జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రజల శాంతిభద్రతల పరిరక్షణకు, భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ నిఘా వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేస్తోందని ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. ముదినేపల్లి మండలం సంగరాయపాలెం గ్రామంలోని గ్రోవెల్ ప్రాసెసర్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా డ్రోన్స్, సీసీ కెమెరాలను ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కంపెనీ డైరెక్టర్లు చింతపల్లి సుధీర్, పొట్లూరు శ్రీనివాస్ చేతులమీదుగా సూర్యచంద్రరావుకు అందజేశారు. రూ.16,04,800 విలువైన రెండు డ్రోన్స్, రూ.8.85 లక్షల విలువైన 100 సీసీ కెమెరాలను అందించారు. కార్యక్రమంలో గ్రోవెల్ ప్రాసెసర్స్ ప్రైవేటు లిమిటెడ్ ప్రతినిధులు హెచ్ఆర్ ప్రతిమ, జనరల్ మేనేజర్ సిద్ధి లింగేశ్వర్‌రావు, ఫైనాన్స్ మేనేజర్ పి.శ్రీనివాస్, ఎస్‌బీ సీఐ మల్లేశ్వరరావు, ఐటీకోర్ ఇన్‌చార్జి ఆర్ఎస్ఐ నరేంద్ర, పోలీస్ అధికారులు, కంపెనీ ప్రతినిధులు ఉన్నారు.

సోమా ఇంజినీర్‌కి మరో అవార్డు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన సోమా కన్‌స్ట్రక్షన్స్ అండ్ కన్సల్టింగ్‌కు చెందిన ఇంజనీర్ సూరత్తు తేజను మరో అవార్డు వరించింది. తేజ రూపొందించిన షకినాస్ ట్రూ లైఫ్ హాస్పిటల్ నిర్మాణానికి అందించిన ప్లాన్ ఐసీఐ అల్ట్రాటెక్ అవార్డ్స్–2024లో ఔట్‌స్టాండింగ్ కాంక్రీట్ స్ట్రక్చర్––మర్షియల్ అవార్డుకు ఎంపికైంది. ఇటీవల విశాఖపట్నంలో ఆయనకు ఈ అవార్డును అందజేశారు.

కనకదుర్గమ్మకు విశేష అభిషేకాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక బావిశెట్టివారి పేట కనకదుర్గ ఆలయంలో అమావాస్య సందర్భంగా శనివారం విశేష అభిషేకాలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం 108 లీటర్ల ఆవుపాలు, పసుపు, కుంకుమ, చందనం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు.

రైస్‌మిల్లుల్లో గోనె సంచుల పరిశీలన

పెదపాడు :నాణ్యమైన గోనె సంచులు రైతులకు అందించాలని పెదపాడు తహసీల్దార్ ఏ కృష్ణ జ్యోతి మిల్లర్లను ఆదేశించారు. మండలంలోని కొక్కిరపాడు గ్రామంలో రైస్ మిల్లులో గొనె సంచులను పెదపాడు తహసీల్దార్ ఏ కృష్ణ జ్యోతి శనివారం పరిశీలించారు. చిరిగిన సంచులను రైతులకు అందించి వారికి అసౌకర్యం కలిగించరాదని సూచించారు. ఈకార్యక్రమంలో ఆమె వెంట వీఆర్వోలు బీ కోటేశ్వరావు, అల్లు ప్రసాద్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆశీల వేలం ఖరారు

కొయ్యలగూడెం: పరింపూడి పంచాయతీ పరిధిలో 2025–26 సంవత్సరానికి సంబంధించిన వారపు సంత, రోజువారీ ఆసీల వేలం పాట శనివారం ఖరారైందని గ్రామ కార్యదర్శి కె.సురేష్ తెలిపారు. రోజువారీ మార్కెట్ వసూళ్లకు రూ.5.90 లక్షలు, వారపు సంత మార్కెట్ వసూలుకు రూ.2.60 లక్షలకు గుత్తేదారులు వేలంపాటను దక్కించుకున్నట్లు చెప్పారు. రూ.2.50 లక్షల దరావతు చెల్లించిన గుత్తేదారులకు ఆశీల వసూలుకు సంబంధించిన ఉత్తర్వుల పత్రాన్ని అందజేశామని తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం



పిప్పరలో సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి

గణపవరం: ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి అన్నారు. శనివారం ఆయన గణపవరం మండలంలోని పిప్పర, కేశవరం గ్రామాలలో పాఠశాలలను సందర్శించి తనను గెలిపించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన పిప్పర ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి విగ్రహానికి పూలమాల వేసి ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన డిఏబకాయిలన్నీ చెల్లించాలని, కొత్త పిఆర్‌సి తక్షణం ఏర్పాటు చేయాలని, పాఠశాలల విలీనం ప్రక్రియలో ఉపాధ్యాయుల అభిప్రాయాలమేరకే ముందుకెళ్లాలని, ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించి బోధనకు సమయం ఇవ్వాలని ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులకు ఏసమస్య వచ్చినా తాను వెన్నంటి ఉంటానని హామీ ఇచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేయనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో జిల్లా యుటిఎఫ్ అధ్యక్షుడు విజయరామరాజు, సీనియర్ నాయకుడు హోతా ఆంజనేయులు, మండల బాధ్యులు పాల్గొన్నారు. అనంతరం వివిధ పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు

గణపవరం: ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన పాఠశాలల రీస్ట్రక్చరింగ్‌కు సంబంధించి విలీనం అవుతున్న పాఠశాలల హెచ్ఎంలు ఎస్ఎంసి తీర్మానాలు అనుకూలంగాచేసి ఇవ్వాలన్న నిర్ణయం సరికాదని, ఈవిధంగా ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడం తగదని గణపవరం మండల యుటీఎఫ్ వ్యతిరేకిస్తున్నట్లు మండల నాయకులు తెలిపారు. ఈమేరకు ఎంఈవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఎస్ఎస్‌సి సప్లిమెంటరీ పరీక్షలలో ఇన్విజిలేటర్ విధులు నిర్వహించిన ఉపాధ్యాయుల ఇఎల్‌లు, ఎస్ఆర్‌లలో నమోదు చేయాలని, అదనపు అర్హతలు పొందిన ఉపాధ్యాయుల ఎస్ఆర్‌లలో అర్హతలు నమోదుచేయాలని, మండల కోఆర్డినేషన్ సమావేశం ఏర్పాటుచేయాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. మండల యుటీఎఫ్ అధ్యక్షుడు బి.రమేష్, మద్దాల వెంకటేశ్వరరావు, భవానిప్రసాద్ పాల్గొన్నారు.